# ఓ పెళ్ళి కథ

సెలవలకి హైదరాబాద్ నుంచి తెనాలి వెళ్ళిన వెంకటేష్ని అతని తల్లిదండ్రులు పెళ్ళిచూపులకి తీసుకెళ్ళారు.

"నాకిప్పుడే పెళ్ళికేం తొందర ?" అని వెంకటేష్ బయటకి అన్నా లోపల అతనికి పెళ్ళిచేసుకోవాలనే వుంది.

కారణం పాతికేళ్ళ క్రితంలా తను స్కూల్లో పిల్లలకి పాఠాలుచెప్పి. అలసిపోయి ఇంటికి తిరిగి వచ్చేసరికి తన భార్య కాఫీగ్లాసుతో ఎదురవ్వాలన్న కోరిక లేదా ఇంటి భోజనం తినాలన్న ఇచ్ఛకాదు.

కట్నం....డబ్బు

అతనికి కలర్ టి. వీ కొనాలని ఉంది. ఆల్విన్ గ్రీన్ కలర్ ఫ్రిజ్ మీద కోరుకుంది. హోండా మీద మనసుంది. కనీసం ఏభై వేల బ్యాంక్ డిపాజిట్ మీద మక్కువుంది.

అందుచేత తెనాలిలోని ఇద్దరమ్మాయిలని పెళ్ళిచూసాడు. వెంకటేష్కి చిన్నప్పట్నుంచి తన పెళ్ళానికి బారెడు పొడుగుండే నల్లటి జడ వుండాలన్న కోరికుంది. చూసిన ఇద్దరిలో లక్ష్మికి అలాంటి జడవుంది. అంతేకాదు లక్షణంగా కూడా వుంది.

భారతి చామనచాయలో సుమారుగా వుంది. మరీ పిలకజడ.

"నాకైతే లక్ష్మి బెటర్ అనిపిస్తోంది" చెప్పాడు వెంకటేష్ తండ్రి కొడుకుతో ఆ రాత్రి.

"అదీ అలా వుంచండి కట్నం మాటేమిటి ?" అడిగింది వెంకటేష్ తల్లి.

"లక్ష్మి పేర పొలం అంటూ ఏమీలేదుట, లక్షన్నర దాకా ఇస్తామని అన్నాడా పిల్ల తండ్రి"

"భారతి మాటో ?" అడిగాడు వెంకటేష్.

"నాలుగెకరాల పొలం అమ్మాయి పేరన వుంది. ఏటా వచ్చే పంట డబ్బు అమ్మాయికేట. కట్నం రెండుదాకా ఇస్తారని పిల్ల బాబాయ్ చెప్పాడు. తండ్రి పోబోయేముందు ముగ్గురు ఆడపిల్లల పేర తలో లక్షబ్యాంక్‌లో వేసాడట, మూడునెలలకోసారి వడ్డీ వచ్చేలా."

"అంటే లక్ష్మికన్నా భారతిని చేసుకుంటే ఎక్కువ ముడుతుం దంటారు ?" అడిగింది వెంకటేష్ తల్లి.

"అంతేగా మరి."

"జాతకాలు ?" అడిగాడు వెంకటేష్.

"లక్ష్మివాళ్ళకి పట్టింపు వుంది. భారతికి అలాంటి నమ్మకాలు లేవుట. దేవుడి ముందు దీపంకూడా వెలిగించే ఎరగదట" చెప్పారాయన.

"మీ ఉద్దేశం ఏమిటి నాన్నగారు ?" అడిగాడు వెంకటేష్.

"డబ్బు శాశ్వతంకాదు. పిల్ల శాశ్వతం. నువ్వే ఆలోచించుకో"

తండ్రి సూటిగా సమాధానం చెప్పివుంటే 'లక్ష్మిని చేసుకోరా' అని వుండేవాడని వెంకటేష్‌కి తెలుసు.

"నాలుగెకరాలంటే ఈ రోజుల్లో నాలుగు లక్షలు చేస్తుంది. పైగా మాగాణి. లక్ష్మికన్నా భారతి ద్వారా నాలుగైదు లక్షలు అదనంగా ముడు తున్నప్పుడు వేరే ఆలోచన దేనికి ? సింగారంకన్నా బంగారం చాలాకాలం ఉంటుంది" తన ఉద్దేశం కొడుకు అడక్కుండానే చెప్పింది వెంకటేష్ తల్లి.

"ఆలోచించుకుని లెటర్ రాస్తాను" చెప్పాడు వెంకటేష్ హైదరాబాద్ వెళ్ళబోతూ.

"మరో పదిరోజుల్లో నీకు ఇరవై ఏడు నిండుతాయి. త్వరగా తేల్చుకో" హెచ్చరించాడు తండ్రి.

అతనికి భారతి తెచ్చే ఐశ్వర్యం మనసులో వున్నా, లక్షణంగా వున్న లక్ష్మి, ముఖ్యంగా ఆమె పొడుగాటి జడ గుర్తుకొస్తోంది. ఓ పట్టాన ఎటూ నిర్ణయం చేసుకోలేకపోయాడు. అందుకే వారందాకా ఇంటికి జవాబు రాయలేదు.

లక్ష్మినే చేసుకుంటాను అని రాసిన కార్డుని డబ్బాలో వేయబోయే ముందు చింపేశాడు. జడెంత ముఖ్యమో అతనికి కలర్ టీ. వి, ఫ్రిజ్, హోండా, బ్యాంక్ బాలెన్స్ కూడా అంత ముఖ్యం. కాదు ఇంకా ముఖ్యం.

చివరికి ఓ నిర్ణయానికి వచ్చి భారతినే చేసుకుంటానని లెటర్ రాసాడు తండ్రికి. గదిలో కార్డు లేకపోవడంతో తెల్ల కాగితం మీద రాసాడు. మర్నాడు కవర్ కొని తండ్రికి పోస్ట్ చెయ్యాలనుకున్నాడు.

ఆ రాత్రి వెంకటేష్ తన పుట్టినరోజు సందర్భంగా ఓ చిన్న బార్ కి వెళ్ళాడు తాగుదామని. అతను సగం బీరు తాగాక పక్క కేబిన్ లోంచి మాటలు వినిపించసాగాయి.

"పాపం తండ్రి పోయాడు కాని భలే గుంటరా...."

"నీకు లొంగిందంటావు?"

"ఆహ నా గదికి వచ్చి వెళ్ళేది."

"ఇప్పుడెక్కడుంది"

"తెనాలిలోనే....చూడ్డానికి బావుండదు కానీ ఫ్రీగా వచ్చినప్పుడు వదలడం వేనికి చెప్పు. లేడీస్ కాలేజీల్లో స్టూడెంట్ గా పరిచయం అయిన వాళ్ళలో భారతి. ఇంకా...."

వెంకటేష్ కి అర్థమైంది ఆ లెక్చరర్ 'ఏ భారతి' గురించి మాట్లాడు

తున్నాడో. 'తెనాలిలో' అని అతను చెప్పిన పేట, వీధి పేరు తను పెళ్ళి చూపుల కెళ్ళిన భారతి వివరాలే.

మర్నాడు ఉదయం వెంకటేష్ ఓ నిర్ణయానికి వచ్చాడు. తను రాసిన లెటర్‌ని నిర్భయంగా పోస్ట్ చేసాడు.

పొడుగు జడకన్నా భార్య కన్యాత్వంకన్నా ఆమె తెచ్చే కట్నం తనకి ముఖ్యం అని. పెళ్ళి వ్యాపారం అయి, కట్నంకోసం భార్యని కాల్చి చంపే ఈ సమాజంలో వెంకటేష్ తను కోల్పోయే దానికన్నా, పొందేదే ఎక్కువ అని ఆనందించడంలో పెద్దగా ఆశ్చర్యంలేదు. ఎందుకంటే కట్నం తేలేని ఏ ఆడది సౌందర్యవతి కాదు. గుణవతి కాదు — దటీజ్ టుడేస్ స్టోరీ.

('ఉదయం' ఉగాది సంచిక 1991)